# లీలా మానవుడు

రాత్రి తొమ్మిది దాటింది. రావలసిన సమయానికి విమానం రాలేదు. నేను విమానాశ్రయానికి వెళ్ళలేదు. ఇంట్లోనే ఉండి ఆయన వస్తారని ఎదురు చూశాను. విమానాశ్రయం నుంచి ఇంటికి రావడానికి ఇరవై నిముషాల కన్నా పట్టదు.

గంట దాటింది. ఇంకా రాలేదు. కంగారు పుట్టింది. ఎయిర్ పోర్ట్‌కి ఫోన్ చేస్తే రావాల్సిన విమానం ఇంకా రాలేదని చెప్పారు. ఎంత సేపట్లో వస్తుందో చెప్పలేమన్నారు. ఏమైందో తెలియదన్నారు. ఢిల్లీ నుంచి విమానం బయలు దేరడం సరైన సమయానికే బయలు దేరిందిట.

నా గుండె దడదడలాడింది.

దారిలో విమానాని కేమైనా అయిందా?

అమ్మో, ఇంకేమన్నా ఉందా...విమాన దుర్ఘటన ... టీ వీలో చూపించే దృశ్యాలు...ఒళ్ళు ఝల్లుమంది. ఏ క్షణంలో ఏ వార్త వినాలో?

అబ్బాయి కూడా ఊళ్లోలేడు. స్నేహితుల ఇళ్ళకి ఫోన్ చేశాను. ఎవరు ఎన్ని రకాలుగా ధైర్యం చెప్పినా మనస్సు పరిపరి విధాల పోయింది. నేను ఫోన్ చేసిన స్నేహితులే మళ్ళీ ఒక్కొక్కరే ఫోన్ చేసి అడగడం- ఆయన వచ్చారా? అంటూ.... ఏవేవో సలహాలూ సాంత్వన వచనాలూ చెప్పడం. ఎయిర్‌పోర్టుకి మళ్ళీ ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఎంగేజ్డ్ శబ్దం... ఏం చెయ్యడం, భగవన్నామ స్మరణచేస్తూ.... పడుకోలేక, కూర్చోలేక ఇల్లంతా కాలుకాలిన పిల్లిలా తిరుగుతూ.... గడియారంకేసి ఎంత సేపు ఎన్నిసార్లు చూసినా కాలం గడవడంలేదు. మనిషి రాలేదు, ఏ కబురూ లేదు. ఏ కబురొస్తుందో నన్న భయం....చివరికి ఆ భగవంతుణ్ణే శరణు వేడుకున్నాను-ఆయన సురక్షితంగా ఇంటికి చేరుకునేటట్లు చెయ్యి తండ్రీ అని. మొక్కుకున్నాను కూడా-'ఆయన సురక్షితంగా ఇంటికొచ్చేటట్లు చేస్తే నీ కొండ మీదికొచ్చి తడిబట్టలతో సాష్టాంగ ప్రమాణాలు చేస్తూ మూడుసార్లు ప్రదక్షిణం చేస్తాను తండ్రీ' అని. అన్న ప్రకారం వెంటనే కొండ మీది కొస్తానో రానో అని ఏడుకొండలవాడు అనుమానిస్తాడేమో నని, 'ప్రదక్షిణాలు పూర్తయ్యేవరకూ ఈక్షణం నుంచి ఒక్క మెతుకు కూడా ముట్టను తండ్రీ, నన్నునమ్ము, నన్ను రక్షించు' అంటూ వేడుకున్నాను.

ఏదో సాంకేతికమైన ఇబ్బంది వల్ల విమానాన్ని నాగపూర్‌లోఆపే శారుట. విమానం బాగు పడ్డాక మర్నాడు పొద్దున్న ఏడు గంటల ప్రాంతానికి ఇంటి కొచ్చారు. వెంటనే దేవుడికి కొబ్బరికాయ కొట్టాను ముందుగా.

వంట చేసి ఆయన కొక్కరికే వడ్డిస్తూంటే చూసి నన్నూ భోజ నానికి కూర్చోమన్నారు.

వద్దండీ, ఇప్పుడప్పుడే తీసెయ్యను. ముందు కొండమీది కెళ్ళి మొక్కు తీర్చుకోవాలి. ఆ తర్వాత గానీ తీసెయ్యను' అన్నాను.

అంత వరకూ చిరునవ్వుతో ఉన్న ఆయన ముఖం కఠినంగా మారిపోయింది.

'నీకు రోజు రోజుకీ భక్తి ముదిరి వెర్రెక్కువవుతోంది. ఆ తిండి మానెయ్యడం పిచ్చేమిటి? నువ్వు మొక్కుకోవడం వల్లనే ఆ విమానం బాగుపడి వచ్చిందంటావా? చదవేస్తే ఉన్నమతి పోయిందట!' అన్నారు వెటకారంగా.

'ఈ ఒక్కసారికీ నన్ను తిట్టకండి, జీవితంలో ఇంకెప్పుడూ మొక్కుకోను, ఒట్టు' అన్నాను.

ఆయన పళ్ళు బిగబట్టి 'నీకర్మ' అన్నారు.

ఆ సాయంకాలం మా అబ్బాయి ఊరునుండితిరిగొచ్చాక,మర్నాడు వాతో కలిసి బయలుదేరి నన్ను కొండమీదికి తీసుకు వెళ్ళమని బతిమాలాను. ఆ పరిస్థితిలో వాడు నా మాట కాదన్లేదు.

రైల్లో ప్రయాణం చేస్తూ అనుకున్నాను ఇంకెప్పుడూ ఏ కష్టం వచ్చినా ఎటువంటి మొక్కూ మొక్కుకోకూడదని. ఏమైతే అవుతుంది ఎవరికీ ఇబ్బంది కలిగించకూడదనుకున్నాను. నాకు పరిమితమైన ఉపవాసాల్లాంటివి మొక్కుకోవడానికి కూడా సాధ్యంకావడంలేదాయెను. ఇది వరకొకసారి ఒంటిమీదనున్న బంగారం హుండీలో వేస్తానని మొక్కుకున్నప్పుడు ఎన్నిచివాట్లు తిన్నాను ఆయన చేత!

ఊరికే మొక్కుకున్నానా? మా అబ్బాయికి స్కూటర్ యాక్సిడెంట్ అయినపుడు వాడు రోజంతా కోమాలో ఉన్నపుడు ఆ విషమ పరిస్థితిలో మొక్కుకున్నాను నా గొలుసూ, గాజులజతా కొండమీద హుండీలో వేస్తానని. వాటిని వెంటనే తీసి ముడుపుకట్టి ఉంచాను. దేవుడి దయవల్ల అబ్బాయి ప్రమాదం నుంచి బయటపడ్డాడు తర్వాత నా మొక్కు సంగతి తెలిసి ఆయన నన్ను ముక్క చివాట్లు పేశారు నాకు ఒళ్ళూపై తెలియట్లేదనీ, డబ్బు విలువ తెలియట్లేదనీ, ఇంకా ఎన్నో అన్నారు. నాకు ఉడుకు మొత్తనం వచ్చి, 'ఆ నగలు మీరు చేయించినవి కాదులెండి. మా నాన్నగారు చేయించినవి' అన్నాను.

'ఏమిటా మొండి వాదన? మీ నాన్న చేయించినవైతేనేం, నేను చేయించినవైతేనేం, ఏవైనా విలువైనవే. మళ్లీ చేయించాలంటే ఎంతవుతుందో తెలుసా? అలా ముందూ వెనకా ఆలోచించకుండా హుండీలో వేసెయ్యడమేనా? నాతో సంప్రదించాలని కూడా తోచలేదా?' అని నిలదీశారు.

'నా సొమ్ములు, నా ఇష్టం. నా కొడుకు ప్రమాదం నుంచి బయటపడటం ముఖ్యమా, ముష్టి నగలా?' అన్నాను.

'నీ సొమ్ములు! నీ కొడుకు? ఏం స్వార్థం? ఇది మన సంసారం అన్న సంగతి నీకు గుర్తు లేదు పాపం!' అన్నారు వెటకారంగా.

నేనేమీ మాట్లాడలేదు ఆ సమయంలో, ఎందుకో అప్పటి నుంచీ దేవుడికి కొబ్బరి కాయ కొట్టాలన్నా ఏదో తప్పు చేస్తున్న భావన—ఎవరి సొమ్మునో వ్యర్థం చేస్తున్న భావన. నేను కూడా ఉద్యోగం చేస్తూ ఉండి

ఉంటే ఇలా ప్రతి ఖర్చుకీ ఒకరి మీద ఆధారపడటం జరిగేది కాదు కదా. ఇన్ని మాటలు పడవలసి రాదుకదా అనిపించేది.

అసలీ మొక్కులు మొక్కుకోవడం పెళ్లయాకే అలవాటైంది. చిన్నప్పుడు పరీక్షలు పాసవ్వాలని దేవుడికి దణ్ణంపెట్టుకోవడమే గాని మొక్కుకోలేదు ఎప్పుడూ. దణ్ణం పెట్టుకుని బాగా చదువుకోవడమే నా వంతు. తక్కినవన్నీ అమ్మచూసుకునేది—అంటే, గుళ్లో అర్చన చేయించడం లాంటివి.

నా పెళ్లయితే నన్నూ, ఆయన్నీ పసుపు బట్టలతో కొండకి పంపిస్తానని మొక్కుకుందిట అమ్మ. పెళ్లయాక ఆ విషయం ఆయనతో చెప్పినప్పుడు ఆయన తెల్లబోయి 'ఛీ, పసుపు బట్టలతో ఏమిటి!' అన్నారు.

అదేమిటండీ, మన మధుపర్కాలతో నండీ' అన్నాను.

'ఛ. అవి కట్టుకుని ఊళ్లమ్మట తిరుగుతామా?' అన్నారు.

'అది కాదండీ...' అని నేను చెప్పబోతూంటే,

'ఏం, నీకు పెళ్లికాదని భయపడ్డారా?' అన్నారు. ఆయన ప్రశ్నకి నాకు కళ్లనీళ్లు తిరిగాయి.

'సరే, సరే వెడదాంలే' అన్నారు నన్ను దగ్గరకు తీసుకుంటూ. కానీ, తర్వాత, ఆడపిల్ల పుట్టాలని నేను మొక్కుకున్నప్పుడు ఇంతెత్తు లేచారు. మొదటి కానుపుకి మగపిల్లవాడు పుట్టాడు. నాకు రెండోసారి కూడా ఎక్కడ మగపిల్లవాడు పుడతాడోనని నాభయం. ఇద్దరు పిల్లలు

కన్న ననేమిరా వీల్లేదన్నారు ఆయన. ఆడపిల్ల ఉంటే ఆ ముద్దుముచ్చట వేరు. ఆడపిల్ల పుడితే కొండమీదకొచ్చి స్వామి కల్యాణం చేయిస్తానని మొక్కుకున్నానని చెప్పగావే చచ్చేట్లు చివాట్లు వేశారు నన్ను. అసలే ఆయనకి పూజా పునస్కారాలంటే గిట్టవు.

'నేను చస్తే రాను. కొండమీదికెలా వెడతావ్, ఎప్పుడెడతావ్?' అంటూ ధూంధాం అన్నారు.

'ఎలాగో వెడతాలెండి, మీరేం తీసికెళ్లక్కర్లేదు.' అన్నాను. ఇంకా నయం! ఆయనతో కలిసి కొండమీది కొస్తానని మొక్కుకోలేదు.

ఆడపిల్లే పుట్టింది. నా కోరిక తీరింది. కానీ పిల్లని చూడగానే నా గుండెల్లో రాయి పడింది. పిల్ల నల్లగా ఉంది. 'బాబోయ్, దీనికి పెళ్లెలా అవుతుంది?'— అదే నాకొచ్చిన మొదటి ఆలోచన. చామనచాయగా ఉన్నా నాకోసం నాన్నగారు ఎన్ని తిప్పలు పడ్డారో గుర్తుకొచ్చి గుండె బరువెక్కిపోయింది. అక్కడి కక్కడే, అప్పటి కప్పుడే మొక్కుకున్నాను-'ఈపిల్లకి మంచి సంబంధం కుదిరి పెళ్ళయే టట్లు చేస్తే కొండమీదికి నడిచొచ్చి నీ దర్శనం చేసుకుంటాను తండ్రీ' అని. అప్పటికే ఒక పెద్ద మొక్కుంది తీర్చడానికి.

పిల్లకి ఏడాది దాటేవరకూ ఇల్లు కదలడానికి కుదరలేదు నాకు. ఆ తర్వాత ఓ సారి మా బంధువులు తిరుపతి వెడుతూంటే వాళ్ళతో బాటే వెళ్ళి పిల్లకి ఏకంగా పుట్టువెంట్రుకలు కూడా తీయించుకొచ్చాను. పాతికేళ్ల తర్వాత పిల్ల పెళ్లిమొక్కుకూడా ఎలాగో తీర్చాను. ఆ తర్వాత పెద్దమొక్కులు మొక్కకుండా జాగ్రత్త పడ్డాను.

కానీ చిన్నచిన్న బాధలు కలిగినప్పుడల్లా ఒకటో రెండో మూడో అయిదో కొబ్బరికాయలు బాధ తీవ్రతని బట్టి మొక్కుకుంటూండేదాన్ని. దానికూడా ఆయన విసుక్కునేవారు. కొబ్బరికాయ ధర అంతకంతకీ పెరిగిపోతోంది, ఎందుకా అనవసరపు ఖర్చులు అంటూ. మనస్సు చివుక్కుమనేది నాకు చివరికి, ఆయనకి ఆ కష్టం కూడా కలిగించ కూడదని, ఉపవాసాలుంటానని మొక్కుకునేదాన్ని. ఒకటి, రెండు, మూడు —వచ్చిన కష్టాన్ని బట్టి శనివారాల సంఖ్య పెంచేదాన్ని. నేనెప్పుడైనా నీరసంగా ఉండండే చాలు ఉపవాసాలు చేస్తున్నానని చివాట్లు పెట్టేవారు. అంతేగాని పనిలో సాయం చేద్దామని గానీ మరోవిధంగా ఉపశమనం కలిగిద్దామనిగానీ అనుకునేవారు కాదాయన—ఈ సంసారపు కష్టాలన్నీ నావే అయినట్టు.

ఎంత వద్దనుకున్నా అబ్బాయికి యాక్సిడెంట్ అయినప్పుడు మనసు మనసులోలేక ఒంటిమీద సొమ్ములు తీసి హుండీలో వేస్తానని మొక్కుకున్నాను.

ఇదుగో మళ్లీ ఈ విమాన ప్రమాదానికి భయపడి ఆయనకేమైనా అయిపోతుందేమోనని బాధపడిపోయి మొక్కుకున్నాను. ఆ బాధ అలాంటిది. ఆయనకేమైనా జరిగితే నా బ్రతుకేమైపోయేది! దేవుడి దయవల్ల ఆయన తిరిగొచ్చారు క్షేమంగా నా మొక్కు ఒక లెక్కా!

రెండు రోజులపాటు తిండి తినకపోయినా ఎక్కణ్ణించి వచ్చిందో ఓపిక- రైలు ప్రయాణం, బస్సుప్రయాణం చేసి అబ్బాయితో కలిసి కొండ మీదికెళ్లాను.

స్నానం చేసి ఆ తడిబట్టలతోనే గుళ్లోకి వెళ్లి, స్వామి దర్శనం చేసుకుని ధ్వజస్తంభం దగ్గర సాష్టాంగ పడి పొర్లుతూ ప్రదక్షిణం ప్రారంభించాను. సగం మేర నాఅంతట నేనే పొర్లాను. తర్వాత నా వల్ల కాలేదు. మా అబ్బాయిని పొర్లించమన్నాను. నాతో బాటే ఇంకొకావిడ అలాగే పొర్లుతోంది. నాకు క్రమక్రమంగా ఒళ్లు చితకపొడిచినట్లయి కళ్లు తిరిగి పోతున్నట్లనిపించింది. ఎలాగో ప్రదక్షిణాలు పూర్తి చేశాను. ఆ తర్వాత అబ్బాయి నన్ను ఎలా బయటికి చేర వేశాడో, ఎలా ఇల్లు చేర్చాడో నాకే తెలియదు.

ఇంటికి తిరిగొచ్చాక కూడా కోలుకోలేక పోయాను. అస్వస్థత ఎక్కువైంది. లేడీడాక్టరు దగ్గరికి తీసికెళ్లారు నన్ను. ఆవిడ నన్ను ప్రశ్నించి, పరీక్షలు జరిపి, ఇవతలికొచ్చాక చివాట్లేసింది ఇద్దరినీ— వ్యాధి ఇంత ముదిరేవరకూ ఎందుకు అశ్రద్ధ చేశారని చెప్పి. పొత్తి కడుపులో ట్యూమరు—తక్షణం ఆపరేషను చేయించుకోవాలని చెప్పింది.

ఆస్పత్రిలో చేర్పించారు నన్ను. డాక్టర్లు తయారవుతున్నారు. ఆయన నాపక్కన కూర్చుని అడిగారు—'ఇన్నాళ్లనుంచీ బాధపడుతూ నాతో ఎందుకు చెప్పలేదు? డాక్టరు దగ్గరికి ఎందుకు వెళ్లలేదు?' అని.

'నా బాధ్యతలన్నీ అయిపోయాయి. ఎప్పుడో అప్పుడు వెళ్లిపోవాల్సిందే కదా. ఈ పసుపు కుంకుమలతో ఇలాగే వెళ్లిపోవాలనిపించిందండీ' అన్నాను చిరునవ్వుతో.

'పసుపు కుంకుమల కోసం ప్రాణాలు తీసుకుంటావా? వాటిమీద అంత మమకారం ఉంటే నేపోయాక నువ్వు పెట్టుకుంటానంటే ఎవరొద్దంటారు?'

ఆయన నోటిని చప్పున నా చేత్తో మూసేసి, 'అలా అనకండి' అన్నాను కళ్లనీళ్లు పెట్టుకుని.

ఆయన నా చేతిని తీసి పక్కన పెట్టి, 'నీకెప్పుడూ స్వార్థమే. నీ పసుపు కుంకాల కోసమే గానీ నువ్వులేకపోతే నాగతేమవుతుందని ఆలోచించావా?' అన్నారు వొణుకుతున్న కంఠంతో.

'ఇద్దరిలో ఎవరో ఒకరు ముందు పోవాల్సిందే కదండీ' అన్నాను సముదాయిస్తున్నట్లు.

'అయితే కావచ్చు. నువ్వుమాత్రం ఇప్పుడు పోవడానికి వీల్లేదు. నీకేమీ కాదు కాకూడదని దణ్ణం పెట్టుకున్నాను. నీకు నయమయాక ఇద్దరం కలిసి కొండమీది కెళ్లి దర్శనం చేసుకుందాం' అన్నారు.

నేను ఆశ్చర్యంగా చూశాను ఆయన వైపు.

'అవును' అన్నారు రెండు చేతుల్తో నా చెయ్యిపట్టుకుని.

నాకళ్లమ్మట నీళ్లు బొటబొటా కారాయి. ఉబుకుతున్న కన్నీరు దాచుకోవడానికి ఆయన ముఖం పక్కకి తిప్పుకున్నారు.

నేను పైకి చూస్తూ దణ్ణం పెట్టుకుని, 'మనుషుల మానసిక బలహీనతల్తో ఆడుకునే లీలా మానవుడవు కదయ్యా నీవు!' అనుకున్నాను.

(ఉదయం నవతరం వారపత్రిక, ఉగాది ప్రత్యేక సంచిక, 1990)